క్లుప్తంగా

బీసీ రిజర్వేషన్లను వర్గీకరణతో అమలు చేయాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థ ఎన్నికల్లో బీసీ కులాలకు 42 శాతం రిజర్వేషన్‌ ప్రకటించడం హర్షణీయమని అయితే బీసీ రిజర్వేషన్‌ను ఏ,బీ, సీ,డీ వర్గీకరణతో అమలు చేయాలని బహుజన లెఫ్ట్‌ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్‌ డిమాండ్‌ చేశారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ... దేశంలోనే తమిళనాడు తరువాత తెలంగాణ ప్రభుత్వం సీఎం రేవంత్‌ రెడ్డి నాయకత్వంలో స్థానిక సంస్థల్లో బీసీ కులాలకు 42 శాతం రిజర్వేషన్‌ బిల్లు తీసుకురావడం గొప్ప పరిణామమని అన్నారు. ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం చరిత్రలో స్థిరస్థాయిగా నిలిచి పోతుందన్నారు.

చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి దేవాలయ హుండీ కానుకలను బుధవారం లెక్కించారు. మార్చి 27 నుంచి జూలై 16 తేదీ వరకు 112 రోజులకు గాను 27 లక్షల 16 వేల 701 రూపాయి ఆదాయం వచ్చినట్లు ఆలయ వ్యవస్థాపక వంశీయులు శ్రీనాథ్‌గౌడ్‌ కార్యానిర్వహణ అధికారి ఎస్‌. అన్నపూర్ణ, ఇన్‌స్పెక్టర్‌ వి. సురేఖ తెలిపారు. ఇందులో 25 లక్షల 54 వేల 688 రూపాయల నోట్లు , ఒక లక్ష 62 వేల 13 రూపాయల కాయిన్స్‌, 147 రూపాయల ఫారెన్‌ కరెన్సీ రూపంలో లభించిందన్నారు.

స్థానిక సంస్థల్లో బ్రాహ్మణులకు సీట్లు కేటాయించాలి

నల్లకుంట: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బ్రాహ్మణులకు జనాబా దామాషా ప్రకారం తగిన సీట్లు కేటాయించాలని తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి(టీబీఎస్‌ఎస్‌) రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణా రావు అన్ని పార్టీలను కోరారు. బుధవారం సాయంత్రం నల్లకుంటలో టీబీఎస్‌ఎస్‌ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. అనంతరం పోచంపల్లి రమణారావు మాట్లాడుతూ.. తెలంగాణలో ఏదైన ఒక జిల్లాకు మాజీ ప్రధాని దివంగత పీవీ నరసింహారావు పేరు పెట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బ్రాహ్మణ పరిషత్‌ పునరుద్ధరించి వివేకానంద విదేశీ విద్యా పథకం, బెస్ట్‌ స్కీమ్‌ నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. అదే విధంగా పేద బ్రాహ్మణులకు ఇందిరమ్మ ఇళ్లు, అర్హులకు పింఛన్లు, రేషన్‌కార్డులు ఇవ్వాలన్నారు.

పైపులైన్‌ పనులు ప్రారంభం



అంబర్‌పేట: గోల్నాక డివిజన్‌ వడ్డెర బస్తీలో రూ.13 లక్షల వ్యయంతో నూతనంగా చేపట్టనున్న డ్రైనేజ్‌ పైపులైన్‌ నిర్మాణపు పనులను బుధవారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌ ప్రారంభించారు. ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య వసతులు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్‌ దూసరి లావణ్య శ్రీనివాస్‌ గౌడ్‌, బస్తీ పెద్దలు, బీఆర్‌ఎస్‌ నేతలు పాల్గొన్నారు.

జర్నలిస్టుల అక్రెడిటేషన్‌ కమిటీలు రద్దు చేయాలి

కాచిగూడ: జర్నలిస్టుల అక్రెడిటేషన్‌ కమిటీలు రద్దు చేయాలని తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘం నేతలు బుధవారం ప్రెస్‌ అకాడమీ చైర్మన్‌ శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నేతలు మాట్లాడుతూ... అక్రెడిటేషన్‌ నిబంధనలు కఠిన తరం చేసి జర్నలిజాన్ని కాపాడాలన్నారు. టెస్ట్‌ ఉత్తీర్ణులై జర్నలిజం చేసిన వాళ్ల అందరికీ పరీక్షలు పెట్టి అక్రెడిటేషన్‌ జారీ చేయాలని కోరారు. టోల్‌గేట్‌ల వద్ద రిపోర్టర్లకు ఉచిత ప్రయాణం కల్పించాలన్నారు. అనారోగ్యానికి గురైన రిపోర్టర్ల ఆస్పత్రి బిల్లులో సగం అకాడమీ భరించాని విజ్ఞప్తి చేశారు. అక్రెడిటేషన్‌ జారీలో 20శాతం మంది రిపోర్టర్లకు న్యాయం జరుగుతుందన్నారు. 80శాతం అక్రెడిటేషన్‌ కార్డులు అనర్హులకు ఇచ్చి పక్కదారి పడుతున్నాయని వారు పేర్కొన్నారు. అక్రెడిటేషన్‌ కార్డులు అమ్ముతున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆర్డినెన్స్‌ ముసాయిదాను గవర్నర్‌ ఆమోదించాలి

కవాడిగూడ: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ హైకోర్టు ఆదేశాల మేరకు సెప్టెంబర్‌ 30లోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఆమ్‌ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్‌ డాక్టర్‌ దిడ్డి సుధాకర్‌ కోరారు. బుధవారం లిబర్టీలోని ఆప్‌ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీల రిజర్వేషన్ల అంశాన్ని రాజకీయ కోణంలో ఆలోచించకుండా బీసీలకు న్యాయం చేయాలన్న చిత్తశుద్ధితో ముందడుగు వేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ఆర్డినెన్స్‌ ముసాయిదాను రాష్ట్ర గవర్నర్‌ ఆమోదించాలన్నారు. ఆ తర్వాత చట్టం తీసుకొచ్చి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఫీవర్‌ ఆవరణలో కుక్కల బెడద

- పట్టించుకోని జీహెచ్‌ఎంసీ యానిమల్‌ విభాగం



ఫీవర్‌ ఆస్పత్రి రెండో గేటు వద్ద కుక్కలు

నల్లకుంట: నిత్యం రోగులతో కిటకిటలాడే నల్లకుంట ఫీవర్‌ ఆస్పత్రిలో వీధి కుక్కల బెడద ఎక్కువైంది. ఆస్పత్రి ఆవరణతో పాటు ఆస్పత్రి ప్రధాన గేట్‌, ఓపీ విభాగం, ఆర్‌ఎంవో ఛాంబర్‌, వార్డు 2, 3, 4 ఎదురుగా, మైక్రో బయాలజీ ల్యాబ్‌, రేబిస్‌ వార్డు, వైరాలజీ ల్యాబ్‌, ఫార్మసీ భవనం తదితర ప్రాంతాల్లో ఈ కుక్కలు గుంపులుగా చేరి కూర్చుంటున్నాయి. రోగులు, రోగుల సహాయకులపై పొరపాటున దాడులు చేసినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. సాక్షాత్తు ఆస్పత్రి సూపరింటెండెంట్‌ చాంబర్‌, ఆర్‌ఎంవో చాంబర్‌ ఎదుట కుక్కలు గుంపులుగా చేరి కూర్చుంటున్నాయి. ఇక రాత్రి అయ్యిందంటే కుక్కలు పెద్ద ఎత్తున అరుస్తుండడంతో రోగులు, వారి సహాయకులు భయాందోళనకు లోనవుతున్నారు. ఫార్మసీ భవనం పరిసరాల్లో కుక్కలు ఎక్కువగా సంచరిస్తున్నాయి.

- ఆస్పత్రి ఆవరణలో కుక్కల బెడదపై ఆస్పత్రి అధికారులు జీహెచ్‌ఎంసీ యానిమల్‌ విభాగం అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశారు. యానిమల్‌ క్యాచర్లు వచ్చిన సమయంలో వ్యాన్‌ వాసన పసిగడుతున్న ఆ కుక్కలు దొరక్కుండా అక్కడి నుంచి ఆస్పత్రి వెనుక వైపున ఉన్న చెట్ల పొదల్లోకి పారిపోతున్నాయని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. వరుసగా ఓ రెండు మూడు రోజుల పాటు మాటు వేస్తే ఆ వీధి కుక్కలను బంధించవచ్చని ఆస్పత్రి సీఎస్‌ ఆర్‌ఎంఒ డాక్టర్‌ జయలక్ష్మి అన్నారు. ఆ దిశగా జీహెచ్‌ఎంస్‌ యానిమల్‌ క్యాచ్‌ విభాగం చొరవ తీసుకోవాలని ఆస్పత్రి సిబ్బంది రోగులు, వారి సహాయకులు కోరుతున్నారు.

ఇటీవల ఓ వ్యక్తిపై పిచ్చి కుక్క దాడి..

ఆరు నెలల క్రితం ఓ పిచ్చి కుక్క ఆస్పత్రి ఆవరణలోకి ప్రవేశించింది. అది పిచ్చి కుక్క అని తెలియని వార్డు బాయ్‌లు రాళ్లతో కొట్టి భయపెట్టి తరమేసేందుకు ప్రయత్నించారు. దీంతో రెచ్చిపోయిన ఆ కుక్క రాయి దాడి నుంచి తప్పించుకొని అదే రాయిని నోట కరుచుకొని వార్డు బాయ్‌లపై దూసుకొచ్చిందని ఆస్పత్రి ఉద్యోగులు తెలిపారు. దీంతో భయపడిపోయిన ముగ్గురు వార్డుబాయిలు ఆ పక్కనే ఉన్న గదిలోకి వెళ్లడంతో అది అక్కడి నుంచి వెళ్లిపోయింది.

- అదే రోజు రాత్రి 3 గంటల సమయంలో మద్యం సేవించిన ఓ వ్యక్తి ఆస్పత్రి మెయిన్‌ గేట్‌ సమీపంలో పడుకున్నాడు. ఆ సమయంలో అటుగా వచ్చిన ఆ పిచ్చి కుక్క అతడిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చిందని ఆస్పత్రి సిబ్బంది పేర్కొన్నారు. కుక్క దాడిలో గాయపడిన వ్యక్తి కాలిపై చర్మం పూర్తిగా తొలగిపోయింది చెప్పారు. కుక్క దాడిలో గాయపడిన అతను ఆస్పత్రి వెనుక ఉన్న బస్తీ వాసి అని తెలిసింది. అతని కాలిపై చర్మం తొలగించి అతి కష్టం మీద రిగ్‌ ఇంజక్షన్‌, ఏఆర్వీ, టీటీ ఇంజక్షన్‌ ఇచ్చి పంపించామని ఓ వార్డు బాయి తెలిపాడు.

28 కులాలను ఓబీసీలో చేర్చాలి

ఆర్‌.కృష్ణయ్యకు ఓబీసీ జాయింట్‌ యాక్షన్‌ కమిటీ వినతి



నల్లకుంట: తెలంగాణ రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన 28 కులాలను ఓబీసీ జాబితాలో చేర్చేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఓబీసీ జాయింట్‌ యాక్షన్‌ కమిటీ బుధవారం రాజ్యసభ సభ్యుడు ఆర్‌. కృష్ణయ్యకు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఓబీసీ జేఏసీ చైర్మన్‌ వెన్న ఈశ్వరప్ప, అధ్యక్షుడు చట్ట శివాజీ, వర్కింగ్‌ ప్రసిడెంట్‌ పి.శ్రీనివాస్‌, ప్రధాన కార్యదర్శి మోహన్‌ చౌహాన్‌, కార్యదర్శి ప్రవీణ్‌కుమార్‌ తదితరులు బుధవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఆర్‌. కృష్ణయ్యను కలిసి వినతి పత్రం అందజేశారు.

- ఈ సందర్భంగా ఈశ్వరప్ప మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం 28 కులాలను ఓబీసీ జాబితాలో చేర్చాలని జాతీయ కమిషన్‌కు సిఫారసు చేసిందని చెప్పారు. బీసీ కమిషన్‌ పూర్తిగా అధ్యయనం చేసిన నివేదికను కేంద్ర ప్రభుత్వానికి, బీసీ మంత్రిత్వ శాఖకు సమర్పించిందని తెలిపారు. గతంలో హైదరాబాద్‌ ఎల్బీ స్టేడియంలో జరిగిన ఓ సభలో పాల్గొన్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తమ 28 కులాలను ఓబీసీ జాబితాలో చేరుస్తామని హామీ ఇచ్చారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ విషయంపై రాజ్యసభలో తమ గళాన్ని వినిపించాలని ఆర్‌. కృష్ణయ్యను కోరారు.
- గత 15 సంవత్సరాలుగా తమ కులాలకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ, విద్యా రంగంలో రిజర్వేషన్లు అందక తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. దీంతో తమ పిల్లలు ఉన్నత చదువులకు నోచుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కులాలను ఓబీసీ జాబితాలో చేర్చాలని ఆయన కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆర్‌.కృష్ణయ్యను కలిసిన వారిలో జేఏసీ కోశాధికారి వేముల శ్రీనివాస్‌, నాయకుడు జాజేరావు వేదాకర్‌ తదితరులు ఉన్నారు.

సంపూర్ణ మద్య నిషేధం అమలు చేయాలి

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్‌.కృష్ణయ్య



కాచిగూడలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌.కృష్ణయ్య, గుజ్జ కృష్ణ, శ్రావణి

కాచిగూడ: దేశంలో మహిళకు సరైన రక్షణ, గౌరవం దక్కాలంటే దేశ వ్యాప్తంగా సంపూర్ణ మద్యనిషేధం అమలు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్‌.కృష్ణయ్య డిమాండ్‌ చేశారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా ప్రధానకార్యదర్శి శ్రావణి అధ్యక్షతన బుధవారం కాచిగూడ లోని అభినందన్‌ గ్రాండ్‌లో జరిగిన సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్‌ గుజ్జ కృష్ణ తో కలిసి ఆయన పాల్గొని ప్రసంగించారు. మద్య నిషేధం అమలుకు కేంద్ర, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని ఆయన కోరారు. మహిళలను అంగడి బొమ్మలుగా, ఆట వస్తువులుగా చూపిస్తూ మహిళ గౌరవాన్ని కించపరుస్తూ వస్తునా సినిమాలపై సెన్సార్‌బోర్డు కఠిన చర్యలు తీసుకునే విధంగా తగు సూచనలు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్‌ కోటా కల్పించాలని డిమాండ్‌ చేశారు. బీసీ మహిళలకు సబ్‌కోటా దక్కకపోతే మహిళా బిల్లుకు సార్థకతే లేదన్నారు. మహిళల పక్షపాతి అయిన ప్రధాని మోదీ అన్ని రంగాలలో మహిళలకు ప్రాతినిధ్యం కల్పించాలని ఆలోచిస్తున్నారని అన్నారు. బీసీ మహిళలకు కూడా ప్రాతినిధ్యం కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గుజ్జకృష్ణ, కరుణ, పి.సుధాకర్‌, జి.మల్లేష్‌, తంగెళ్లమూడి నంద గోపాల్‌, జిల్లాపెల్లి అంజి, పగిళ్ల సతీష్‌, పృథ్వీగౌడ్‌, శ్రీకాంత్‌, కవిత, స్వామిగౌడ్‌, హరి తిలక్‌సింగ్‌, సజిదా, బాలయ్య, రవియాదవ్‌, నిఖిల్‌ పటేల్‌ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో సుందరయ్య పార్కును సందర్శిస్తా

- స్పీకర్‌ గడ్డం ప్రసాద్‌ కుమార్‌



స్పీకర్‌ను కలిసిన నాగభూషణం, మనోహర్‌రెడ్డి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నగరంలో ప్రతిష్టాత్మకమైన బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్కును త్వరలో సందర్శిస్తామని తెలంగాణ శాసనసభ స్పీకర్‌ గడ్డం ప్రసాద్‌కుమార్‌ అన్నారు. బుధవారం వాకర్స్‌ క్లబ్‌ ఆఫ్‌ హైదరాబాద్‌ సెంట్రల్‌ ప్రధాన కార్యదర్శి సైకం మనోహర్‌రెడ్డి, వాకర్స్‌ ఇంటర్నేషనల్‌ మాజీ అధ్యక్షుడు, సీనియర్‌ కాంగ్రెస్‌ నాయకులు విభూది నాగభూషణం మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ప్రసాద్‌ కుమార్‌ గత స్మృతులను నెమరువేసుకున్నారు. తాను కూడా వాకర్స్‌ క్లబ్‌ సభ్యుడినేనని తెలిపారు. బర్కత్‌పురాలో నివాసం ఉన్నప్పుడు ప్రతి రోజు సుందరయ్య పార్కులో వాకింగ్‌ చేయడంతో పాటు షెటిల్‌ కూడా ఆడేవాడినని గుర్తు చేసుకున్నారు. త్వరలో పార్కుని సందర్శించి పార్కు అభివృద్ధి కోసం తన వంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. స్పీకర్‌ను కలిసిన వారిలో వాకర్స్‌ క్లబ్‌ సభ్యులు కూరగాయల శ్రీను తదితరులు ఉన్నారు.

ముగిసిన చండీ, కుబేర పాశుపత యాగం



తుల్జాభవన్‌లో జరిగిన యాగం ముగింపు పూజలో కార్పొరేటర్‌ ఉమారాణి, తదితరులు

కాచిగూడ: ధూపదీప నైవేద్య అర్చక సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ అభివృద్ధిని ఆకాంక్షిస్తూ లోక కల్యాణార్థం మూడు రోజులుగా పంచకుండాత్మక చండీ, కుబేర పాశుపత యాగం ముగిసింది. తుల్జాభవన్‌లో బుధవారం గణపతి హోమం తదితర పూజలు నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వానికి వేద ఆశీర్వచనం చేశారు. అనంతరం వేదపండితులకు సత్కరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్‌ వేణుగోపాలాచారి, కార్పొరేటర్‌ ఉమారాణి, తుల్జాభవన్‌ ఈఓ అంజనారెడ్డి, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ముషీరాబాద్‌: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ అన్నారు. బుధవారం పార్శిగుట్ట వద్ద ఉమెన్‌ అండ్‌ చైల్డ్‌ వెల్ఫేర్‌ ఆర్గనైజేషన్‌, అభిషేక్‌ పోలీ క్లీనిక్‌ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా గైనకాలజీ, డెంటల్‌, అప్తాల్మాలజీ, ఫిజియోథెరపీ, బీపీ, షుగర్‌, రక్త పరీక్షలు తదితర పరీక్షలు నిర్వహించారు. 500ల మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజేషన్‌ అధ్యక్షుడు డాక్టర్‌ అశోక్‌, మెడికల్‌ మిషన్‌ హెడ్‌ డాక్టర్‌ అభిషేక్‌, డివిజన్‌ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, నాయకులు శివ ముదిరాజ్‌, శ్రీధర్‌చారి, టెంట్‌హౌస్‌ శ్రీనివాస్‌, వెంకటేశ్వర్‌రావు, ప్రభాకర్‌, డాక్టర్‌ అంజీలీనా, డాక్టర్‌ వంశీ, డాక్టర్‌ అన్నిరోజ్‌, డాక్టర్‌ ప్రేమలీల, డాక్టర్‌ బాబురావు పాల్గొన్నారు.

కార్మికుల ససమస్యలను పరిష్కరించాలి: బీఎంఎస్‌

చిక్కడపల్లి: కార్మికుల సమస్యలను పరిష్కరించాలని బీఎంఎస్‌ జాతీయ ఉపాధ్యక్షుడు మల్లేశం ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర కార్మికశాఖ మంత్రి జి.వివేక్‌వెంకటస్వామిని ఆయన బీఎంఎస్‌ ప్రతినిధి బృందంతో కలసి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కనీస వేతనాల జీఓను సవరించి కార్మికులకు రూ.25,000 చెల్లించాలన్నారు. బీడీ కార్మికులకు జీవన భృతి, అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలను పెంచాలన్నారు. అసంఘటిత కార్మిక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి కార్మికులను ఆదుకోవాలన్నారు. రసాయన పరిశ్రమల్లో తనిఖీలు నిర్వహించి రక్షణ చర్యలు చేపట్టేలా చూడాలన్నారు. సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో చనిపోయిన కార్మికుల కుటుంబాలకు నష్టపరిహారం వెంటనే అందేలా చొరవ చూపాలన్నారు. మంత్రి సమస్యలకు సానుకూలంగా స్పందించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని ఆయన చెప్పారు.

మంచిగా చదువుకున్నప్పుడే ఉజ్వల భవిష్యత్‌

ముషీరాబాద్‌: విద్యార్థులు క్రమశిక్షణతో బాగా చదువుకున్నప్పుడే ఉజ్వల భవిష్యత్‌ ఉంటుందని కాంగ్రెస్‌ సికింద్రాబాద్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగాల శ్రీకాంత్‌గౌడ్‌ అన్నారు. బుధవారం లింగాల చంద్రకళ నామదాసుగౌడ్‌ చారిటబుల్‌ ట్రస్ట్‌ ఆధ్వర్యంలో ముషీరాబాద్‌, మొరంబొంద ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు, స్టేషనరీ సామగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మీసాల జైకుమార్‌, మురళీమోజెస్‌, పట్నం నాగభూషణంగౌడ్‌, మేడి సురేష్‌ కుమార్‌, రాజ్‌దీప్‌, లింగంగుప్తా, జీఎస్‌ చారి, రమేష్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఇకపై ఎప్పుడైనా.. ఎక్కడైనా డ్రంకన్‌ డ్రైవ్‌

చిక్కడపల్లిలో 9, కాచిగూడలో 10మందిపై డీడీ కేసులు నమోదు



బయోలాజికల్‌ ఇ లిమిటెడ్‌ ఎక్స్‌ రోడ్‌ వద్ద స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహిస్తున్న ట్రాఫిక్‌ పోలీసులు

కాచిగూడ: నగర పోలీస్‌ కమిషనర్‌, ట్రాఫిక్‌ జాయింట్‌ పోలీస్‌ కమిషనర్‌ ఆదేశాల మేరకు బుధవారం మధ్యాహ్నం బర్కత్‌పుర చౌరస్తాలో అకస్మికంగా డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ (డీడీ) తనిఖీలు నిర్వహించారు. డ్రంక్‌ డ్రైవ్‌లో మోతాదుకు మించి మద్యం సేవించిన 10మందిపై కేసులు బుక్‌ చేసినట్లు కాచిగూడ ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ శ్రీనివాస్‌ తెలిపారు. ఇక నుంచి 24 గంటల్లో ఎక్కడ పడితే అక్కడ, ఏ సమయంలోనైనా డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

బయోలాజికల్‌ ఈ లిమిటెడ్‌ ఎక్స్‌రోడ్‌ వద్ద

చిక్కడపల్లి: మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న తొమ్మిది మందిపై చిక్కడపల్లి ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ వీరేశం డీడీ కేసులు నమోదు చేశారు. బయోలాజికల్‌ ఈ లిమిటెడ్‌ ఎక్స్‌రోడ్‌ వద్ద బుధవారం సాయంత్రం ట్రాఫిక్‌ పోలీసులు నగర సీపీ, జాయింట్‌ సీపీల సూచన మేరకు డ్రంకెన్‌ డ్రైవ్‌ నిర్వహించారు. మొత్తం 9మంది వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. వీరిలో ముగ్గురు ఆటో డ్రైవర్లు, ఆరుగురు వాహనాలు నడిపే వారు ఉన్నారని ఇన్‌స్పెక్టర్లు తెలిపారు. వారిపై కేసులు నమోదు చేశామని తెలిపారు.

దివ్యాంగుల సంక్షేమానికి ప్రధాని మోదీ పెద్దపీట



సహాయ పరికాలకు ఎంపికైన దివ్యాంగులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న కార్పొరేటర్‌ సుప్రియ

ముషీరాబాద్‌: అన్ని వర్గాల ప్రజలతో పాటు దివ్యాంగుల సంక్షేమానికి ప్రధాని నరేంద్రమోదీ బడ్జెట్‌లో పెద్దపీట వేశారని ముషీరాబాద్‌ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్‌ రమేష్‌రాం అన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో ముషీరాబాద్‌ నియోజకవర్గంలోని దివ్యాంగులకు సహాయ పరికరాల ఎంపిక శిబిరాన్ని నిర్వహించారు. బుధవారం భోలక్‌పూర్‌, కవాడిగూడ, తాళ్లబస్తీ కమ్యూనిటీహాల్‌లో దివ్యాంగులకు పరీక్షలు నిర్వహించి వారికి కావాల్సిన పరికరాల కోసం ఎంపిక చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందజేసి రమేష్‌రాం మాట్లాడుతూ... ఎంపికై న వారికి త్వరలో ఆయా పరికరాలను అందజేస్తామని పేర్కొన్నారు. దివ్యాంగుల కోసం కేంద్ర ప్రభుత్వం అంకితభావంతో పని చేస్తూ వారికి కావాల్సిన అవసరాలను తీర్చుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల విభాగం బీజేపీ కన్వీనర్‌ కొల్లి నాగేశ్వర్‌రావు, పార్లమెంట్‌ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్‌ రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్‌ సుప్రియానవీన్‌గౌడ్‌, పూసరాజు, కనకేష్‌కుమార్‌, సారంగపాణి, నర్సింహ, రఘు, మహేష్‌కుమార్‌, రాంరెడ్డి, చంద్రమోహన్‌, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

‘కంప్యూటర్‌ విద్య’ సృజనాత్మకతను పెంచుతుంది



కంప్యూటర్‌పై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సంజయ్‌కుమార్‌

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కంప్యూటర్‌ విద్య మనుషుల్లో సృజనాత్మకతను పెంచుతుందని ప్రముఖ విద్యావేత్త షాన్‌షా ఇనోవేషన్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌ మేనేజర్‌ సంజయ్‌కుమార్‌ అన్నారు. కంప్యూటర్‌ విద్యను పుస్తకాల ద్వారానే కాకుండా కంప్యూటర్‌ సిస్టమ్‌లో ప్రాక్టికల్‌, ప్రయోగాత్మకంగా ఉపయోగించుకోవచ్చని అన్నారు. బుధవారం డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ అటనామస్‌ కళాశాలలో ఎక్స్‌పర్ట్‌ టాక్‌ సిరీస్‌ అనే అంశంపై ప్రసంగించారు. ఈ సందర్భంగా సంజయ్‌కుమార్‌ మాట్లాడుతూ.... కంప్యూటర్‌ ఆధునిక కాలంలో ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. మనం ఇచ్చే ఆదేశాల ప్రకారం పనిచేసే వేగవంతమైన ఎలక్ట్రానిక్‌ యంత్రాంగమని చెప్పారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్‌ విభాగాధిపతి రూప, కళాశాల ప్రిన్సిపల మట్టా శేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లోపు ఉద్యోగ నోటిఫికేషన్‌ వేయాలి



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేష్‌

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్థానిక ఎన్నికల్లోపు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్‌ విడుదల చేయాలని డీవైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోటా రమేష్‌, ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్‌ డిమాండ్‌ చేశారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో రౌండ్‌ టేబుల్‌ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం ‘నీళ్లు, నిధులు, నియమకాలే..’ప్రధాన ఎజెండాగా జరిగిందన్నారు. గత ప్రభుత్వం యువతకు ఉద్యోగ, ఉపాధిని కల్పించడంలో నిర్లక్ష్యం చేసిందన్నారు. ఉద్యోగాలు ఇవ్వకపోగా ఇచ్చిన నోటిఫికేషన్లకు పేపర్‌ లీకులు చేసి.. పరీక్షలు వాయిదా వేసి.. కోర్టు వివాదాలు సృష్టించారని ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్‌ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జాబ్‌ కేలండర్‌ ప్రకటించి ఉద్యోగాలు భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పుట్టా లక్ష్మణ్‌, దామెరా కిరణ్‌, మహేష్‌, నాగరాజు, జావెద్‌, భీమేష్‌, జార్జిరెడ్డి, నాగేశ్వరరావు, సుమంత్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి హిందువు ఆలయాలను కాపాడుకోవాలి



అమ్మవారికి వెండి ఆభరణాలను సమర్పించేందుకు వెళ్తున్న కార్పొరేటర్‌ పావని

చిక్కడపల్లి: అమ్మవార్ల దేవాలయాల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందించడం అదృష్టంగా భావిస్తున్నామని గాంధీనగర్‌ కార్పొరేటర్‌ పావని అన్నారు. అరుంధతినగర్‌ బస్తీలోని శ్రీకట్టమైసమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ పునః ప్రతిష్ఠాపనోత్సవం చేస్తున్నారు. ఈ మేరకు అమ్మవారికి సుమారు 71 తులాల వెండితో చతుర్భుజాలు, వెండి తొడుగులను కార్పొరేటర్‌ తయారు చేయించారు. బుధవారం కార్పొరేటర్‌ పావనివినయ్‌కుమార్‌ దంపతులు మేళతాళాల మధ్య తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... దేవాలయాలను కాపాడుకోవటం ప్రతి ఒక్క హిందువు బాధ్యతని అన్నారు. ఈ కార్యక్రమంలో వినయ్‌కుమార్‌, రత్నసాయిచంద్‌, శ్రీకాంత్‌, శివకుమార్‌, సురేష్‌, బస్తీ, గుడి కమిటీ సభ్యులు బెల్బాటమ్‌ రాజు, సీహెచ్‌ రాజు, యాదగిరి, ప్రకాష్‌, శ్రీనివాస్‌గౌడ్‌, సరస్వతి, రాములమ్మ, నీలమ్మ, భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

‘కల్లు దుకాణాలు మూసేసే కుట్ర జరుగుతోంది’



ఎన్‌జీఎస్‌ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు బాలకృష్ణగౌడ్‌

నల్లకుంట: గౌడ కులస్తుల కుల వృత్తిని నిర్వీర్యం చేసేందుకు నగర పరిధిలో కల్లు దుకాణాలు మూసేసే కుట్ర జరుగుతోందని నూతన గౌడ సంఘం(ఎన్‌జీఎస్‌) ఆవేదన వ్యక్తం చేసింది. ఎన్‌జీఎస్‌ హైదరాబాద్‌ అధ్యక్షుడు ఆర్‌. హిమగిరి గౌడ్‌ అధ్యక్షతన బుధవారం నల్లకుంటలో ఎన్‌జీఎస్‌ రాష్ట్ర కమిటీ ఆత్మీయ సమావేశం జరిగింది. దీనికి హాజరైన ఎన్‌జీఎస్‌ రాష్ట్ర అధ్యక్షుడు ఉడుతల బాలకృష్ణ గౌడ్‌ మాట్లాడారు. కల్తీ కల్లు సాకుతో గౌడ కుల వృత్తిని నిర్వీర్యం చేసి, తమను ఎదగకుండా చేసేందుకు కొందరు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ఎక్కడో ఒక చోట కల్తీ కల్లు ఘటన చోటు చేసుకుంటే, దానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. అలా కాకుండా హైదరాబాద్‌ నగరంలోని అన్ని కల్లు దుకాణాలను మూసి వేయించి, తమ జీవనోపాధిని దెబ్బతీసేలా చేయడం సరైనది కాదన్నారు. ఇటీవల కొర్రెముల గ్రామ పరిధిలో ఓ రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారి మూడు తాటి చెట్లు మాత్రమే నరికి వేసేందుకు అనుమతి తీసుకుని, ఏకంగా 85 తాటి చెట్లను నరికి వేయించాడని తెలిపారు. దీనిపై విచారణ జరిపించాలని కోరారు. గీత వృత్తిపై ఆధారడి జీవిస్తున్న గౌడ జాతిపై వివక్ష చూపవద్దని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఎన్‌జీఎస్‌ ఉపాధ్యక్షుడు కట్కూరి ప్రదీప్‌గౌడ్‌, శ్రీకాంత్‌గౌడ్‌, ఉడుతల శ్రీనివాస్‌గౌడ్‌, ఎలికట్టె ఆనంద్‌గౌడ్‌, చర్లపల్లి కిరణ్‌గౌడ్‌, కొంపల్లి లక్ష్మణ్‌గౌడ్‌, జగన్‌గౌడ్‌, రాఘవేందర్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.